క్లుప్తంగా

స్వామివారికి వెండి తొడుగు వితరణ



గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయానికి శనివారం నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన రామకృష్ణగౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలోని ఆంజనేయస్వామి విగ్రహానికి రూ.లక్ష విలువ చేసే వెండి తొడుగును వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మొక్కు తీరడంతో స్వామివారికి వెండి తొడుగు అందించినట్లు తెలిపారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి



వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భద్రసోమును నియమించారు. శనివారం కళాశాలలో బాధ్యతలను స్వీకరించిన ప్రిన్సిపాల్ భద్రసోమును కళాశాల అధ్యాపకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యాప్రమాణాలు పెంపొందించడం కోసం అధ్యాపకులు తమవంతు బాధ్యతగా పనిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమవంతు బాధ్యతగా తమకు సహకరించాలని కోరారు.

రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరణ



పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతువేదికలో రుణమాఫీ వర్తించని రైతుల నుంచి శనివారం దరఖాస్తులు స్వీకరించినట్లు ఏఓ, నోడల్‌అధికారి సాజీద్‌రహమాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్నా.. సాంకేతిక కారణాలతో రుణమాఫీ వర్తించని రైతుల దరఖాస్తుల స్వీకరణతో పాటు రూ.2 లక్షలకు పైబడి అప్పులున్న వారి అనుమానాలను నివృత్తి చేస్తున్నట్లు ఏఓ పేర్కొన్నారు. మాఫీ వర్తించని రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ కాపీలు జత చేసి, దరఖాస్తు ఫారంలో రైతుల వివరాలు నమోదు చేసి ఇవ్వాలని సూచించారు.

హోమియోపతి వైద్య శిబిరం



వనపర్తి రూరల్: తెలంగాణ ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం పెబ్బేరు మండలంలోని రాంపురంలో ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య అధికారి వసుందర రోగులకు బీపీ, షుగర్, నడుమునొప్పి, మెడనొప్పులు, మలబద్ధకానికి సంబంధించి 95 మందికి పరీక్షలు నిర్వహించి హోమియో మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఫార్మాసిస్టులు గోపాల్‌గౌడ్, సురేందర్, ఏఎన్‌ఎం వెంకటమ్మ, రాములు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు ఆహ్వానం



మదనాపురం: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కొన్నూరు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు 4 రోజుల పాటు జరిగే వేడుకలకు హాజరు కావాలని ఎస్‌ఐకి ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో అనిత, నరేందర్‌రెడ్డి, బాలరాజు, పద్మ తదితరులు ఉన్నారు.

ఓపెన్‌స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

ఆత్మకూర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో వతరగతి, ఇంటర్‌లో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఉర్దూ మీడియం పాఠశాల జీహెచ్‌ఎం జిందె అనంతరాం తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 10వ తేదీ లోపు ఆత్మకూర్‌లోని ఉర్దూమీడియం పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు పాఠశాలలోని ఉపాధ్యాయులను సంప్రదించాలని వివరించారు.

వనపర్తిలో 'జలగోస'

- రామన్‌పాడు పైపులైన్లను తవ్వి వదిలేయడంతో సమస్య
- వారం రోజులు నిలిచిపోయిన నీటి సరఫరా
- బయటపడిన మున్సిపాలిటీ నిర్లక్ష్యం



వాటర్ ట్యాంక్‌ల వద్ద నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు

వనపర్తి టౌన్: మున్సిపాలిటీలో ప్రజలకు తాగునీటి గోస తలెత్తింది. వర్షాకాలంలో నిండు వేసవికి మించిన ఎద్దడితో ప్రజలు అల్లాడిపోతున్నారు. దీంతో ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఉన్నతాధికారులు దృష్టి సారించడంతో శనివారం నుంచి పైపులైన్ల మరమ్మతు చర్యల్లో వేగం పెరిగినా.. పూర్తి స్థాయిలో సమస్య తీరలేదు. పట్టణంలోని 12వేల పైచిలుకు నల్లా కనెక్షన్లు, 11 ట్యాంక్‌లకు నీటి చుక్క రావడం లేదు. అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో రామన్‌పాడు సమీపంలోని ఎర్రగట్టు నుంచి మదనాపురం వరకు నాలుగైదు చోట్ల తవ్వి వదిలేసిన హెచ్‌డీపీ పైపులైన్లకు మరమ్మతులకు నోచుకోవట్లేదు. మంగళవారం నుంచి తాగునీటి సమస్య తలెత్తినా తవ్విన పైపులైన్లు అలాగే వదిలేశారు. సమస్య తీవ్రం కావడంతో రెండు రోజులుగా వాటర్ ట్యాంకుల ద్వారా ఉప్పు నీటిని సరఫరా చేస్తున్నారు.

తాత్కాలిక ఉపశమనం

శనివారం రాత్రి వరకు 150పైచిలుకు ట్యాంకర్ల వరకు నీటి సరఫరా చేసి ప్రజలకు కొద్దిమేర ఊరట కలిగించినా.. తాగునీటికి నీటి కొనుగోళ్ల బాధ తప్పడం లేదు. శనివారం కొన్ని కాలనీలకు నీటి సరఫరా జరిగిన పూర్తి స్థాయిలో పట్టణానికి తాగునీటి జలాలు అందలేదు. దీనికి తోడు పట్టణంలోని పలు నీళ్ల ట్యాంకుల వద్ద వాల్‌షట్టర్ బిగుసుకుపోవడంతో తాగునీటిని ట్యాంకులకు ఎక్కించేందుకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో వనపర్తి పోచిగుట్ట వద్ద మరమ్మతు చేపట్టారు. రామన్‌పాడు నుంచి పట్టణానికి 12.5 ఎంఎల్‌డీ వాటర్ ప్రతిరోజూ రావాల్సి ఉంది. పట్టణానికి తాగునీటి ఎద్దడి తగ్గించేందుకు బుగ్గపల్లి పంప్‌హౌజ్ నుంచి గత ప్రభుత్వ హయంలో గ్రావిటీ ద్వార 20.2 ఎంఎల్‌డీ నీటిని అందించారు. వాల్స్ నిర్వహణలో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఒక రోజు నీటి పంపింగ్ నిలిపివేశారు.

కొరవడిన సమన్వయం

శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో పుర అధికారులు తాగునీటిపై ప్రజలను అప్రమత్తం చేయడం గాని, రామన్‌పాడుపై దృష్టి పెట్టడం కానీ చేయలేదు. అక్కడ పైపులైన్లను తవ్వి వదిలేసిన సంగతి తెలియని దుస్థితిలో ఉండటం పురపాలిక అంతులేని నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అయితే రామన్‌పాడు స్కీంను పరిశీలించేందుకు రెగ్యూలర్ అధికారిని కాకుండా ఔట్‌సోర్సింగ్ అధికారిని నియమించడంతో పక్షం రోజుల కిందట పైపులైన్లు తవ్వించిన విషయాన్ని అధికారులు, పాలకులకు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చేరవేయలేదు. దీనికి తోడు స్థానికంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులే కావడంతో సమస్య జఠిలంగా మారింది. పైపులైన్లకు గురువారం నుంచి మరమ్మతులు చేపట్టినా.. పూర్తయ్యేందుకు మరో మూడు, నాలుగు రోజులు పట్టే అవకాశం ఉంది.

తాగునీటి ఇబ్బంది రానివ్వం

ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తనివ్వం. ఈ మేరకు పైపులైన్ల మరమ్మతులు చేపడుతున్నాం. బుగ్గపల్లి పంప్ హౌస్ నుంచి నీటి సరఫరా నిలిపివేసినట్లు సమాచారం లేదు.

– పూర్ణచందర్, మున్సిపల్ కమిషనర్, వనపర్తి

సమస్య తీరింది

వాల్ మెయింటెనెన్స్‌లో భాగంగా నీటి సరఫరాను 48 గంటలు నిలిపివేశాం. అనుకున్న సమయం కంటే కాస్త సమయం ఎక్కువ పట్టింది. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీని ముందే అప్రమత్తం చేసి ప్రత్యామ్నాయం చేసుకోవాలని సూచించాం. సమస్య పూర్తిగా తీరింది. పంపింగ్ ప్రక్రియ మొదలైంది.

– మేఘారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం



షాదీఖానా సమీపంలో జమ్ముతో పాటు మురుగును చూపుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

అమరచింత: పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని, దీంతో ప్రజలు రోగాలతో ఆస్పత్రులను ఆశ్రయించే పరిస్థితులు దాపరించాయని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కేంద్రంలోని ఒకటో వార్డులో గల షాదీఖాన సమీపంలోని పరిసరాలు మురుగుతో నిండుకుని దుర్వాసన వస్తుందన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో నీటి నిల్వ ప్రదేశాలను గుర్తించి, శుభ్రపరచలేకపోయారని విమర్శించారు. మండల కేంద్రంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్యసేవలు అందకపోవడంతో జ్వరంతో బాధపడుతున్న ప్రజలు ఆత్మకూర్, వనపర్తి పట్టణాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారన్నారు. ప్రతినిత్యం ఫాగింగ్ చేయకపోవడంతో దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు మలేరియా బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మైబు, వినోద్, రాము తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌కు ఘన సన్మానం



డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

పాన్‌గల్: మండల పీఏసీఎస్ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికకావడంతో శనివారం పాన్‌గల్, కేతేపల్లి, కొత్తపేట, రేమద్దుల, శాగాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కర్ణాకర్‌రెడ్డి, మాజీ విండో డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, సుధాకర్ యాదవ్, గోపాల్‌రెడ్డి, హన్మంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిని శనివారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అక్కి శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌గౌడ్, నరసింహానాయుడు అభినందనలు తెలిపారు.

కార్యాలయాలకు వెళ్లేది ఎలా..



ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారిలో అడ్డంగా నిలిపిన వాహనాలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని తహసీల్దార్, వ్యవసాయ, ఎంపీడీఓ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా విద్యాలయం వెళ్లే ప్రధాన రోడ్డుపై అడ్డంగా వాహనాలు నిలుపుతుండటంతో ఆయా కార్యాలయాలకు వెళ్లే ప్రజలు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్రాథమిక వ్యవసాయ కార్యాలయానికి ఎరువుల నిమిత్తం, మీసేవా కేంద్రాలకు వచ్చే జనం తమ ఇష్టానుసారంగా వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయకుండా నిరోధించాలని మండల ప్రజలు కోరుతున్నారు. శనివారం రోడ్డుపై అడ్డంగా నిలిపిన వాహనాలను సాక్షి క్లిక్‌మనిపించింది.

అట్రాసిటీ కేసు నమోదు

అమరచింత: యువకుడిపై ఇద్దరు వ్యక్తులు కలిసి దాడి చేసి గాయపరిచిన ఘటనలో బాధితుడు సంగెపాగు అభినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. పట్టణానికి చెందిన సంగెపాగు అభినయ్ తన కుమారుడికి జ్వరం వచ్చిందని ఉప్పరి వెంకటేష్‌తో కలిసి శుక్రవారం రాత్రి బైక్‌పై వెళ్లి మెడికల్ షాప్‌లో మందులు కొనుగోలు చేసి వస్తున్న సమయంలో శ్రీకాంత్, మహిమూద్ అనే యువకులు ఓంప్రకాష్ కిరాణ షాపు ఎదుట అతడిపై దాడి చేశారని ఎస్‌ఐ తెలిపారు. శ్రీకాంత్ అనే వ్యక్తి నీ చెల్లితో తన తమ్ముడిపై అకారణంగా పోలీసు కేసు పెట్టి జైలుకు పంపిస్తారా అంటూ అభినయ్‌పై దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదు ఇచ్చాడని వెల్లడించారు. ఈ సంఘటనపై కేసు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

గోపాల్‌పేట: మండల కేంద్రంలో వట్టెం బాల్‌రాజు (75) అనారోగ్యంతో బాధపడుతూ మరణించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి తక్షణ ఆర్థికసాయంగా ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి ద్వారా రూ.5వేల ఆర్థికసాయం పంపగా స్థానిక నాయకులు శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. గోపాల్‌పేట గ్రామానికి చెందిన కర్రోళ్ల స్వప్నభాస్కర్ బాల్‌రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయంగా అందించాడు.

అమరచింత ఏఓగా అరవింద్



అమరచింత: మండల నూతన వ్యవసాయ అధికారిగా అరవింద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో వ్యవసాయ శాఖ మండల అధికారిగా విధులు నిర్వహించిన అరవింద్ బదిలీపై అమరచింతకు వచ్చారు. ఈసందర్భంగా ఏఓ అరవింద్ మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటామన్నారు. పంటలను ఆశించిన చీడల పీడల నివారణకు రైతులు ఇష్టారీతిన మందులు పిచికారీ చేయకుండా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని కోరారు. రుణమాఫీ విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా రైతులు నేరుగా వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

తిరుమలయ్యగుట్ట వద్ద భక్తుల సందడి



భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు, బీజేపీ నాయకులు

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం శివారులో తిరుమలయ్య గుట్టపై వెలసిన తిరుమలనాథ వేంకటేశ్వరస్వామి దర్శించుకునేందుకు భక్తులు బారుతు తీరారు. వనపర్తి పట్టణ బీజేపీ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో తోట శ్రీనివాస్‌రెడ్డి దంపతులు 2 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బచ్చు రాము మాట్లాడుతూ తిరుమలయ్యగుట్టను పర్యాటక కేంద్రంగా మార్చాలని ఎమ్మెల్యే మేఘారెడ్డికి విన్నవించగా.. స్పందించిన ఆయన రూ.2కోట్లతో అభివృద్ధి పనుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారన్నారు. కానీ జాతర సందర్భంగా మున్సిపల్ కమిషనర్, చైర్మన్ గుట్టపై కనీస వసతులు కల్పించలేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు శ్రావణమాస నాల్గో శనివారం ప్రజలకు కనీస వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు నవీన్, చాణక్య, మధు తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో గతంలో నిర్ణయించిన భూమిలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని క్రాంతి క్రీడా అసోసియేషన్ అధ్యక్షుడు యాదయ్య శనివారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా 25 ఏళ్లుగా క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మండలం నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ రాష్ట్ర, జాతీయ, అంర్జాతీయ స్థాయిలో సుమారుగా 200 మంది క్రీడాకారులు పతకాలను సాధించారన్నారు. క్రీడాకారులు, యువత బాగు కోసం ప్రభుత్వం నుంచి మినీ స్టేడియం మంజూరు చేయించాలని కోరామన్నారు. దీనికి చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు వారు చెప్పారు.



నేటి నుంచి బద్రోద్దీన్‌షావలి దర్గా ఉత్సవాలు



ఖిల్లాఘనపురం: మండలంలోని తిర్మలాయపల్లి శివారులో మహబూబ్‌నగర్ రోడ్డుకు సమీపంలోని బద్రోద్దీన్‌షావలి దర్గా ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఆదివారం సాయంత్రం ముతవల్లి బద్రోద్దీన్ ఇంటి నుంచి గంధం ఊరేగింపుగా దర్గా వరకు వచ్చి అక్కడ పూజలు నిర్వహించనున్నట్లు ముతవల్లి బద్రోద్దీన్ తెలిపారు. సోమవారం ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. ఉర్సుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే గంధం, ఉర్సును విజయవంతం చేసేందుకు గ్రామ పెద్దలు, భక్తులు సహకరించాలన్నారు.

అలరించిన చిన్ని కృష్ణులు

సాక్షి, నెట్‌వర్క్: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని శనివారం జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను గోపిక, శ్రీకృష్ణుడు వేషధారణలతో అలంకరించి తల్లిదండ్రులు ముచ్చటపడ్డారు. చిన్నారి శ్రీకృష్ణులు ప్రదర్శించిన నృత్యాలు, కోలాటం చూపరులను ఆకర్షించాయి. పాఠశాలల్లో చిన్నారులతో ఉట్లు కొట్టించే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో జూరాల పాఠశాల హెచ్‌ఎం వగ్గు ఉమాశంకర్, ఉపాధ్యాయులు నారాయణ, భానుప్రియ, శ్రీవర్శిణి, స్వాతి, అరుణ, వెంగళరెడ్డి, అనుజ్ఞారెడ్డి, చంద్రయ్య, వీణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



జూరాల ప్రాథమిక పాఠశాలలో వేషధారణలో విద్యార్థులు



కొత్తకోటలో..



వనపర్తిలో..



రాయిణిపేట ప్రాథమిక పాఠశాలలో..

పాలకుల నిర్లక్ష్యంతోనే నీటి ఎద్దడి

వనపర్తి టౌన్: మున్సిపల్ పాలకవర్గం, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే వనపర్తి పట్టణంలో 10రోజులుగా నీటి సమస్య ఉత్పన్నం అయ్యిందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోచుగుట్ట వాటర్ ట్యాంక్ వద్ద మరమ్మతు పనులను శనివారం మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో నీళ్లు పుష్కలంగా, సరైన సమయానికి అందేవని, ఏ రోజు నీటి కొరత ఏర్పడలేదన్నారు. సరైన సమయానికి నీటి సరఫరా చేయడంలో అధికారులు విఫలం కావడంతోనే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ధ్వజమెత్తారు. నెల రోజుల కిందట చేయాల్సిన మరమ్మతు పనులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పైపులైన్లను మరమ్మతులు చేసినా.. వాల్స్ షెటర్స్ పనిచేస్తాయో.. లేదో తెలియని పరిస్థితి ఏర్పడిందని అసహనం వ్యక్తం చేశారు.

'50శాతం మించి రుణమాఫీ జరగలే'



మాట్లాడుతున్న మున్నూరు రవీందర్

వనపర్తిటౌన్: రుణమాఫీ చేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 50 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మున్నూరు రవీందర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతో రైతులు బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల రేషన్ కార్డులు, లోన్ అకౌంట్, ఆధార్ కార్డులు, అప్లికేషన్లు తీసుకొని సెప్టెంబర్ మొదటి వారం వరకు వేచి ఉండాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. మూడేళ్లకు ఒకసారి నిర్వహించే కార్యకర్త సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నామని, ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కో–కన్వీనర్ దాసరాజు ప్రవీణ్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

వనపర్తి రూరల్: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్ అన్నారు. శ్రీరంగాపురం మండల కేంద్రంలో శనివారం బీజేపీ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి హాజరైన ఆయన మండల కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ మండల అధ్యక్షుడిగా విష్ణువర్దన్, ఉపాధ్యక్షులు మోహన్‌రాజు, ప్రధాన కార్యదర్శులు శెట్టి రాజుల శివ, లక్ష్మీనారాయణ, విరాట్, ఐటీ సెల్ కార్యదర్శి గుంటి శివకుమార్‌సాగర్, మండల యువమోర్చా అధ్యక్షుడు నరేష్‌యాదవ్, ఓబీసీ అధ్యక్షుడు మధునాయుడు, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఎండీ నిజాముద్దీన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మిని నియమించారు.

జలాశయాల నిర్మాణంలో వేగం పెంచాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: నియోజకవర్గంలోని బుద్దారం, గణపసముద్రం జలాశయాల నిర్మాణంలో వేగం పెంచాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కోరారు. శనివారం ఎస్‌ఈ కార్యాలయంలో నీటిపారుదలశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ.. అన్నదాతల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని.. కాల్వల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కర్నెతండా ఎత్తిపోతలకు సంబంధించి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను త్వరలో ప్రారంభించేలా చూడాలని సూచించారు. ఖిల్లాఘనపురం మండలం మామిడిమాడ నేరేడు చెరువు పనులు వేగవంతం చేయాలని, కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కాల్వలు, వంతెనల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీ–2, డీ–8, ఎంజే–3, ఖాన్ చెరువు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రేవల్లి మండలం తల్పునూరుతండా 6–ఏ రెగ్యులేటరీ వద్ద మరో రెగ్యులేటరీ నిర్మించి నీటిని విడుదల చేయాలని సూచించారు. సమావేశంలో ఈఈ మధుసూదన్‌రావు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

దోమల నివారణకు సహకరించండి



నర్సింగాపురంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మదనాపురం: మండలంలోని నర్సింగాపురంలో శనివారం జిల్లా ఏఎల్‌ఓ టీమ్ సభ్యుడు గంధం రాజు ఆధ్వర్యంలో దోమల నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వర్షాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంటే దోమలు వృద్ధి చెంది వివిధ రకాల విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. నీటి నిల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చిన్నపాటి జ్వరం వచ్చినా గ్రామస్తులు సమీపంలోని పీహెచ్‌సీని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీటీ రాణి, సిబ్బంది సురేష్, ఏఎన్‌ఎం వనజ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.